టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుపై దృష్టి

అమరచింత: టెక్స్‌టైల్ పార్క్‌ను నియోజకవర్గానికి తీసుకొచ్చి చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తామని కలెక్టర్ తేజస్‌నందులాల్ పవార్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణ శివారులోని అమరచింత చేనేత ఉత్పత్తి దారుల సంఘాన్ని మంగళవారం ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ సందర్శించారు. నాబార్డ్ నిధులతో కొనసాగుతున్న సొసైటీ ద్వారా ఎంత మంది చేనేత కార్మికులు లబ్ధిపొందుతున్నారనే విషయాలను కంపెనీ సీఈఓ శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా చేనేత కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రూ.వంద కోట్లతో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

డంపింగ్ యార్డ్‌ను తొలగించండి

చేనేత ఉత్పత్తుల సంఘం సమీపంలోనే మున్సిపల్ డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం, చెత్త తగలబెట్టడంతో దుర్వాసన, పొగ భరించలేకపోతున్నామని అక్కడి కార్మికులు కలెక్టర్, ఎమ్మెల్యేకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం ను పిలిపించి వెంటనే డంపింగ్ యార్డు తొలగించాలని ఆదేశించారు. అనంతరం కుట్టు మిషన్లతో లబ్ధి పొందుతున్న మహిళలతో ముచ్చటించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ ఉన్నారు.



మదనాపురంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ తేజస్ నందులాల్, జేసీ సంచిత్ గంగ్వార్

సమస్యలు పరిష్కరించాలని వినతి

మండల, పట్టణ ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ వేర్వేరుగా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంగళవారం వినతిపత్రాలు అందించారు.

ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాలు

ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో అవసరమైన సౌకర్యాలను సమకూర్చుతామని, పోస్టుమార్టం గది నిర్మాణానికి తక్షణం రూ.5లక్షలు మంజూరు చేస్తామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, టీపీసీసీ అధికార ప్రతినిధి, గీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ ఆత్మకూర్‌లో సుడిగాలి పర్యటన చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుర్ని రవికాంత్, డాక్టర్ రాజేశ్వరి దంపతులు రూ.లక్ష వెచ్చించి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు.

విద్యార్థులకు నగదు బహుమతి ఇస్తాం

కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో జిల్లా టాపర్లుగా రాణిస్తే రూ.15 వేలు నగదు బహుమతి అందిస్తామని కలెక్టర్ ప్రకటించారు. అలాగే రూ.2 లక్షలు నగదును అందిస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వెల్లడించారు. బాలకిష్టాపూర్‌లోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వారంలోగా పరిష్కారం

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నెలకొన్న సమస్యలను వారంలోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్, ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసాద్, అధ్యాపకులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరమేశ్వరస్వామి చెరువుకట్టను పరిశీలించి చెరువు వెడల్పు, చెరువు లోంచి పరమేశ్వరస్వామి ఆలయం వరకు బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. గాంధీచౌక్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన సీసీరోడ్డు నిర్మాణం, కల్వర్టు, డ్రైయినేజీల నిర్మాణాలు త్వరతగతిన పూర్తిచేయిస్తామని హామీనిచ్చారు.

విద్యార్థులతో కలిసి భోజనం

మదనాపురం: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం రాత్రి కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కొంతసేపు మాట్లాడారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు సరుకుల వివరాలు పరిశీలించి, అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



ఖిల్లాఘనపురం: జిల్లాలో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు ఉంటాయని పంచాయతీరాజ్ ఈఈ మల్లయ్య అన్నారు. మంగళవారం ఆయన డీఈ ప్రమోద్, ఏఈ కబీర్‌దాస్‌తో కలిసి ఖిల్లాఘనపురం, ఉప్పరిపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. కొలతలు, సిమెంటు, ఇసుక, కంకర కలిపే విధానంపై అక్కడ ఉన్న మేస్త్రీని అడిగి తెలుసుకుని, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ రోడ్లను నాణ్యతగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్లు వేసి వదిలివేయకుండా ఖచ్చితంగా మరుసటి రోజు రోడ్డుపై సిమెంటు కట్టలు కట్టడం లేదా రోడ్డుపై రెండు ఇంచుల పాటు ఎర్ర మట్టి వేసి నీటిని మూడు పూటలు పట్టాలని ఆదేశించారు. క్యూరింగ్ చేయకపోతే రోడ్డు నెర్రలు రావడానికి అవకాశం ఉందన్నారు. ఇలాంటి రోడ్లు ఎక్కడ కనిపించిన చర్యలు తప్పవన్నారు. అధికారులు లేకుండా ఎవ్వరు కూడ రోడ్ల నిర్మాణం చేపట్టరాదన్నారు.

క్లుప్తంగా

ఆలయంలో ఆరుద్ర పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ఏకదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు శేఖరయ్య తెలిపారు. పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో గల శివలింగానికి అర్చకులు పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ఆలయంలోని శివలింగానికి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం నిర్వహకులు భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



గోపాల్‌పేట: విద్యాశాఖ ద్వారా పాఠశాలకు అందించేందుకు వచ్చిన లైబ్రరీ పుస్తకాలను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 261 రకాల పుస్తకాలు, ఉన్నత పాఠశాలలకు 120 రకాల పుస్తకాలను ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లకు అందించారు. పుస్తకాలు చదవడం ద్వారా ఎన్నో విషయాలు తెలుస్తాయని, విద్యార్థుల్లో పఠనాసక్తి కూడా పెరుగుతుందని చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని గొల్లపల్లికి చెందిన కొండమ్మ సోమవారం అనారోగ్యంతో మరణించింది. రేవల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్వతాలు, ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణ ఆర్థికసాయంగా రూ.5వేలు పంపగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందించారు. అలాగే రేవల్లి మండలంలోని గౌరిదేవిపల్లికి చెందిన కొరపాల మల్లేష్ సోమవారం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. వారి కుటుంబానికి సైతం రూ.ఐదువేలు అందించారు.

పెద్దమందడి తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు



కొత్తకోట రూరల్: పెద్దమందడి తహసీల్దార్‌గా బి.వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కొంతకాలంగా పనిచేసిన కిషన్‌నాయక్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లగా ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ తహసీల్దార్‌గా పనిచేసిన బి.వెంకటేశ్వర్లు పెద్దమందడి నూతన తహసీల్దార్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



అమరచింత: చదువుకునే వయస్సులో విద్యార్థులు బయటి విషయాలకు ఆకర్షితం కాకుండా చదువుపై దృష్టి సారించాలని ఐసీపీఎస్ అవుట్ రీచ్ వర్కర్ నరేష్‌కుమార్, చైల్డ్‌లైన్ కేస్ వర్కర్ రవిరాజు అన్నారు. ఐసీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అమ్మాయిలు ముఖ్యంగా గుడ్ అండ్ బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. ఎవరైనా అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లయితే పోక్సో యాక్ట్ 2012 ప్రకారం జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బలరాముడు, రవిరాజు, దేవేందర్, కవిత, స్వామి, సురేష్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

పెబ్బేరు రూరల్: వనపర్తి మండల మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన బోయ బక్క తిరుపతయ్య గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని పంజాగుట్టలో గల నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన పాపిరెడ్డి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రూ.2లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి, మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



మహిళలపై వివక్ష చూపొద్దు

వనపర్తి టౌన్: స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమేనని, మహిళలపై వివక్షత చూపకూడదని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్ అన్నారు. మంగళవారం రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల నుంచి రాజీవ్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీఐ నాగభూషణ్, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, చిన్నమ్మథామస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నమ్మథామస్ మాట్లాడుతూ... బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలను, పిల్లల అక్రమ రవాణా, సమాజంలో పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నిర్మూలించి అందరికీ సమాన న్యాయం అందించాలని కోరారు. అనంతరం రాజీవ్‌చౌక్‌లో మానవహారంగా ఏర్పడి అందరికీ సామాజిక న్యాయం లభించే విధంగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కొమ్మ చంద్రశేఖర్, శ్రీలక్ష్మి, జ్యోతి, అరుణ, విశ్వకాంత్, కన్నన్ కుమార్, రాజశేఖర్, కళాశాల సిబ్బంది, సఖి కేంద్రం, భరోసా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ, ప్రిన్సిపాల్, చిన్నమ్మ థామస్

బస్సుల కోసం నిరీక్షణ

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వనపర్తి డిపో నుంచి హైదరాబాద్‌కు కొత్తకోట మీదుగా వెళ్లే బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతో వారు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడటంతో పాటు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. ఉదయం వేళల్లో కొత్తకోట మండల కేంద్రానికి వచ్చి హైదరాబాద్ వెళ్లే వారి సంఖ్య వందల్లో ఉంటుంది. ఆర్టీసీ బస్సులు సరిగ్గా లేకపోవడంతో ప్రయాణికులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. వనపర్తి డిపో నుంచి హైదరాబాద్‌కు కొత్తకోట మీదుగా బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆర్టీసీ బస్సులు కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు కొత్తకోట బస్టాండ్‌కు రాకుండా బైపాస్ మీదుగా నేరుగా వెళ్తుండటంతో ఉదయం 5గంటల నుంచి 8గంటల వరకు బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని, వనపర్తి డిపో అధికారులు కొత్తకోట మీదుగా ఉదయం పూట బస్సులు నడిపి ప్రయాణికులు ఇబ్బందులను తొలగించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



హైదరాబాద్ వెళ్లేందుకు కొత్తకోట బస్టాండ్‌లో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

పాన్‌గల్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ జగన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో పర్యటించి మిషన్ భగీరథ తాగునీటి ట్యాంకులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్యలు ఉన్నాయా? వేసవిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయా? తీసుకోవాల్సిన చర్యలు తదితర వాటిపై ఆరా తీస్తున్నట్లు వివరించారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తగిన సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. అందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీకుమార్, పంచాయతీ కార్యదర్శి రఘు ఉన్నారు.



మిషన్ భగీరథ ట్యాంకును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ జగన్‌మోహన్

రోడ్ల విస్తరణలో జాప్యం ఎందుకు?

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో రూ.45కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టి 80 శాతం పనులు పూర్తి చేశామని, మిగిలిపోయిన 20 శాతం పనులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పూర్తి చేయిస్తారా.. చేయరా? అని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ప్రశ్నించారు. మంగళవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రహదారుల విస్తరణలో భాగంగా రోడ్లపై ఉన్న ఆలయాలను, దర్గాలను తొలగించేందుకు ఆయా వర్గాల ప్రజలను మెప్పించి, ఒప్పించి విస్తరణ చేశామన్నారు. గాంధీచౌక్ సమీపంలోని వాసవీమాత ఆలయం విస్తరణలో పోతుందని గ్రహించి ఆర్యవైశ్యులు మనోభావాలకు అనుగుణంగా రూ. 5కోట్ల విలువైన స్థలాన్ని కేటాయించామని గుర్తుచేశారు. పట్టణ అభివృద్ధికి గత ప్రభుత్వంలో కేటాయించిన నిధులను దారి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద రూ.4.76కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ చేపడితే వాటిని రద్దు చేశారని, రద్దు చేసిన నిధులను తక్షణం తెప్పించాలని డిమాండ్ చేశారు. రూ. 50కోట్ల టఫాఐడీసీ నిధులు ఎస్టిమేట్ ఆమోదానికి పంపామని, వాటిని పట్టణాభివృద్ధికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పాకనాటి కృష్ణ, కంచె రవి, బండారు కృష్ణ, నాగన్న, సమద్, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్, సోషల్ మీడియా సమన్వయకర్త నందిమల్ల అశోక్, నాయకులు స్టార్ రహీం, ఎల్‌ఐసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్

అంజనగిరి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి అంజనగిరి శ్రీలక్ష్మీఅలవేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయంలో ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకం, పుణ్యాహవాచనము, శాత్తుమురై, యాగశాల ప్రవేశం, అంకురార్పణము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి పారాయణ కార్యక్రమం చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముందు భాగాన 108 గుంజలతో పందిరి వేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 25 వరకు ప్రతిరోజు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామని పండితులు కన్నయ్య తెలిపారు.



కొత్తకోట ఎక్సైజ్ సీఐగా కరుణ



కొత్తకోట రూరల్: కొత్తకోట ఎక్సైజ్ సీఐగా కరుణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ సుదీర్ఘకాలం పని చేసిన ఓంకార్ హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు బదిలీకాగా.. ఆయన స్థానంలో హైదరాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ లో పనిచేసే కరుణ ఇక్కడికి వచ్చారు.

నేడు జిల్లాస్థాయి ప్రదర్శన

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం వ్యర్థాలతో ఆకర్షణీయ వస్తువుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు డీఈఓ గోవిందరాజులు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ప్రదర్శన వివరాలను విలేకరులకు వెల్లడించారు. భారత పర్యావరణ, అడవులు, శీతోష్ణ స్థితి మార్పులు మంత్రిత్వశాఖ, టీఎస్ నేషనల్ గ్రీన్‌కార్ప్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రదర్శన నిర్వహిస్తున్నామని.. జిల్లావ్యాప్తంగా 60 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ఏదైనా నిరుపయోగమైన పదార్థం/వస్తువును ఆకర్షణీయ కళారూపంగా మార్చే అంశంపై ప్రదర్శన ఉంటుందని, ప్రతి పాఠశాల నుంచి ఒకే ప్రదర్శన ఉండాలని, ఇందుకు ఇద్దరు విద్యార్థులు, ఒక గైడ్ టీచర్‌ను మాత్రమే అనుమతిస్తా 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని వివరించారు. మొదటి బహుమతిగా రూ.3 వేలు, రెండో బప్రైజ్‌కు రూ. 2వేలు, థర్డ్ ప్రైజ్‌కు రూ. 1000 చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇద్దరు బాలికల అదృశ్యం

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఇద్దరు బాలికలు కనిపించడం లేదని వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని పాతబజారుకు చెందిన పావని, పాతకోటకు చెందిన మౌనిక పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. వీరు ఇద్దరు కలిసి సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లారు. కానీ తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోయేసరికి పావని తల్లిదండ్రులు రాధ, మన్నెం, మౌనిక తల్లిదండ్రులు లక్ష్మి, నాగేశ్వర్ తెలిసిన వారి వద్ద వెతికారు. వారి ఆచూకీ తెలియకపోవడంతో అమ్మాయిల తల్లిదండ్రులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



వనపర్తి టౌన్: గుండె నొప్పి, గెండెపోటు ఒకటే స్వభావంలో ఒకటే ఉన్నా.. రెండు వేరువేరని జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రతినిధి, ప్రముఖ వైద్యుడు వెన్నపూస బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ స్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుండెకు సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గుండె నొప్పి వస్తే సారాబీట్రేట్ ట్యాబ్లెట్ వేసుకుంటే గుండెనొప్పిని నివారించొచ్చని తెలిపారు. గుండె నొప్పి వస్తే తాత్కాలికంగా రక్తనాళాలు మూసుకపోతాయన్నారు. గుండె పోటు వస్తే ఛాతిలో నొప్పి రావడంతో పాటుగా వాంతులు అవడం, వాంతులు అయ్యేలా అనిపించడం, చెమటలు పట్టడం, మలమూత్ర విసర్జన లక్షణాలను గుర్తించాలన్నారు. గుండెపోటు వచ్చినప్పుడు రెస్టలో ఉండి కోంప్లీ ట్యాబ్ ఏ ట్యాబ్లెట్ వేసుకోవడం ద్వారా వైద్య చికిత్స పొందేవరకు మనిషి ప్రాణాలను కాపాడుతుందన్నారు. సైబర్ నేరాల తరహాలో రకరకాల యంత్రాల పేరుతో ప్రజల మానసిక స్థితిని ఆసరాగా చేసుకొని వ్యాధి నిర్ధారణ పేరుతో ఆస్పత్రుల్లో దోపిడి జరగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మెన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ మురళీధర్, సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్‌గౌడ్, సత్తార్, శ్రీనివాస్‌గౌడ్, గందం నాగరాజు, డాక్టర్ భగవంతు, చిన్నమ్మతామస్, కమర్ రహెమాన్, డాక్టర్ భగవంతు తదిరులు పాల్గొన్నారు.

‘ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు’

కొత్తకోట రూరల్: రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటలను దొంగలు దోచుకెళ్లారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని కనిమెట్టకు చెందిన బాలయ్య అనే రైతుకు గ్రామ శివారులోని జాతీయ రహదారి44 పక్కన గల వ్యవసాయ పొలంలో పండించిన పంటను విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 5 క్వింటాళ్ల మక్కలు, 18 సంచుల వడ్లు, ఒక క్వింటా ఎండు మిరపకాయలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని నెల రోజుల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలానికి పక్కనే ఉన్న దాబా వద్ద సీసీ కెమెరాలను పరిశీలించడంతో బొలేరో వాహనంలో తరలించినట్లు కనిపించగా అడ్డాకుల టోల్ గేట్ దగ్గరకు వెళ్లి చూస్తే అక్కడ బొలేరో వాహనంలో తన ధాన్యంపై కప్పిన కవర్లను గుర్తించినట్లు రైతు తెలిపాడు. దొంగతనం జరిగిన తేదీన టోల్‌గేట్ వద్ద ఫాస్ట్ ట్యాగ్‌పై వెళ్లిన బొలేరో వాహనాన్ని పోలీసులు గుర్తిస్తే దొంగతనం ఎవరు చేశారనేది తెలుస్తుందని, కానీ పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయాడు. అంతే కాకుండా కనిమెట్ట గ్రామానికి చెందిన మరో రైతు రాములు బియ్యం పట్టించేందుకు సిద్ధంగా ఉంచిన 10బస్తాల వరిధాన్యం, హైవే పక్కన గల ఓ రైస్ మిల్లు నుంచి కొన్ని వరిధాన్యం బస్తాలు గతంలో చోరీకి గురయ్యాయని సమాచారం. తరచూ దొంగతనాలు జరుగుతుండటంతో హైవే పక్కన గల రైతులు పొలాల దగ్గర పశువులను సైతం ఉంచడం లేదని రైతులు వాపోతున్నారు. దొంగతనాలను, ప్రమాదాలను నివారించేందుకు పోలీసు ఉన్నతాధికారులు హైవేపై ఏఎస్ఐ స్థాయి అధికారితో నిత్యం పెట్రోలింగ్ చేస్తుంటుంది. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వాహనం సైతం పెట్రోలింగ్ చేస్తుంది అయినా ఎందుకు దొంగతనాలు జరుగుతున్నాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

‘భీష్మ’ నగర సంకీర్తన

వనపర్తి టౌన్: సమతా మూర్తి స్ఫూర్తి ప్రపంచానికి చాటి చెప్పేలా చిన్నజీయర్ స్వామి ఆశీస్సులతో సమతా కుంభ్ కార్యక్రమం చేపట్టినట్లు శ్రీ వేంకటేశ్వర దేవాలయ కమిటీ ధర్మకర్త రఘునాథ శర్మ, వికాసతరంగిణి ప్రతినిధులు అన్నారు. భీష్మ ఏకాదశి, సమతా కుంభ్ 24 మహోత్సవంలో భాగంగా వికాసతరంగిణి, వేంకటేశ్వర భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో సమతా మూర్తి, శ్రీరామ నామస్మరణతో నగర సంకీర్తన కార్యక్రమాన్ని భక్తి పారవశ్యంతో నిర్వహించారు. భక్తులు భజనలు చేస్తూ భగవంతుడి స్మరణతో తన్మయత్వంతో మునిగిపోయారు. ప్రతి ఇంటి నుంచి సమతా కుంభ్, 108 దివ్య దేశాల బ్రహ్మోత్సవాలు జరిగే సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ ఉంగ్లం అలేఖ్య, ఉంగ్లం తిరుమల్, సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డి, వికాసతరంగి సభ్యులు నరేందర్, ప్రమీలమ్మ, రాజశ్వరి, సుమిత్ర, భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.



నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



కానాయపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



యాపర్లలో..

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు కేటాయించిన తరగతి గదుల్లోకి వెళ్లి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. హెచ్‌ఎంగా సంధ్యన, ఎంఈఓగా కీర్తనతో పాటు 30మంది విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రమౌళి, ఉపాధ్యాయ బృందం బేతన్‌గౌడ్, వరలక్ష్మీ, కవిత, రవికుమార్, జ్యోతి తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు నైపుణ్యాలు ప్రదర్శించి, తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. హెచ్‌ఎంగా అరవింద్, కలెక్టర్‌గా వంశీ, డీఈఓగా మౌనిక ఒక్క రోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఎచ్‌ఎంగా వ్యవహరించిన అరవింద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించినందుకు గర్వపడుతున్నామని, విద్యార్థులు చదువుతో పాటు, మంచి లక్షణాలు, క్రమశిక్షణ, దేహదారుఢ్యం, క్రీడలపై ఆసక్తి కనబర్చాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యాయులు రజని, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, నాగరాజు, పీఈటీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.